# అశోకవనం

**మ**హా వైభవోపేతమైన లంకా పట్టణంలో అశోకవనం అత్యంత రమణీయమైన ప్రదేశం. అది రావణుడికి ఎక్కువ అభిమానపాత్రమైనది. సీతను ఉంచటానికి అంతకంటె రమ్యమైన ప్రదేశం లేదు. అతను సీతకు చేయదగిన మర్యాదలలోనూ చూపదగిన ప్రత్యేకతలలోనూ ఆమెను అశోకవనంలో ఉండనివ్వటం ఒకటి. ప్రకృతి సౌందర్యానికి అలవాటుపడిన సీత తన అంతఃపురాలలో ఉండలేదు. పైగా సీత మీద లోకం తరవాత ఎటువంటి అన్యాయమైన అపవాదులు వేసినా వెయ్యవచ్చును - తను ఆమెను తన అంతఃపురాలలో ఉంచితే!

సీతాపహరణం రావణుడి వార్ధక్యంలో ఒక పెద్ద నిర్ణయం. సీతను దొంగిలించి తెద్దామని తీర్మానించుకున్న తరవాత రావణుడు చాలాసేపు నవ్వుకున్నాడు. తను అటువంటి కొంటెపని చేసి చాలా కాలమయింది. బుద్ధి వికసించని రోజుల్లో, మదించి ఉండి తను చాలా అత్యాచారాలు చేశాడు. ముఖ్యంగా ఆర్యుల మీద తన శక్తి సామర్థ్యాలు చాలా దుర్వినియోగపరిచాడు అప్పుడు. తన్ను లోకం వీరుడి కింద గణించింది! - "ఆర్యులను మనం రూపుమాపకపోతే, ఆర్యులే మనల్ని రూపుమాపుతారు!" అన్న విశ్వాసంతో - కాదు, భయంతో - ప్రవర్తించిన తన్ను! అప్పటి తన భీరుత్వాన్ని ధీరత్వమని లోకం శ్లాఘించింది - గుడ్డిలోకం! తన మనో నేత్రం కాస్త వికసించటం మొదలు పెట్టేటప్పటికి ఆర్యులను ఆర్యులే నాశనం చేసుకుంటున్నారు. వారిని ఎవరూ ఏమీ చెయ్యనక్కర్లేదని తేలిపోయింది! ఏదీ ఆర్య నాగరికత? ఏరీ ఆర్యులు? ఒక్క దశరథుడూ జనకుడూ తప్ప ఇక చెప్పదగిన ఆర్యరాజు లెవరున్నారు? ఆ దశరథుడికైనా అదృష్టవశాత్తూ వార్ధక్యంలో ఈ పిల్లలు కలగకపోతే ఆర్య క్షత్రియులు అంతరించి ఉండవలసిందే! ఆర్యులతో పని తీరిపోయిందనుకున్న తనకు ఈ రాముడు మళ్ళీ కాస్త పని కలిపించాడు.

పిచ్చిక మీద బ్రహ్మాస్త్ర మన్నట్టుంటుంది తను రాముడితో యుద్ధానికి పోవటం. అటువంటిపని చెయ్యటం పిరికితనమని తను ఎన్నడో గ్రహించి యుద్ధం చెయ్యటం మానేశాడు. పైగా యుద్ధాలు మందుగా పనిచేస్తవి కాని ఆహారం కావు మానవజాతికి. ఈసారి తను అంతదూరం వెళ్ళదలచుకోలేదు. కేవలం రాముడికి చిన్న పాఠం నేర్పటమే

ఈసారి తన పని. విల్లూ బాణాలూ పట్టుకుని ఆ అన్నదమ్ములిద్దరూ అనార్యుల దేశంలోకి వచ్చిపడి, అందిన అనార్యులను మృగాలను వేటాడినట్టు వేటాడుతూ ఆర్య ధర్మం నిర్వర్తించుతున్నామని గర్వించుతున్నారు కామాలు. సీతను తెచ్చి లంకలో పెడితే రామలక్ష్మణులు ఏం చెయ్యగలరో, ఏం చేస్తారో తను చూడవచ్చును. వాళ్ళ ప్రయత్నాలన్నీ విఫలమయిన తరవాత తను సీతను తిరిగి ఇచ్చి వారిని గట్టిగా కోప్పడి ఆర్యావర్తానికి తిప్పిపంపవచ్చును.

ఈ కుర్రతనానికైనా తన్ను శూర్పణఖే ప్రేరేపించింది; తెలివి తక్కువ పెద్దమ్మ! తను వాళ్ళజోలికి వెళ్ళటమెందుకు? పరాభవం పొందటమెందుకు? అయినా శూర్పణఖను అట్లా పరాభవించటంలో రామలక్ష్మణుల అభిప్రాయం ఏమిటి? వాళ్ళకెంత పొగరు! ఎంత అనాలోచన!.... ఆ ఖరదూషణలూ ఈ శూర్పణఖలాగే! వాళ్ళిద్దరూ తమ బలగంతో సహా వెళ్ళి ఈ కుర్రకుంకల చేతుల్లో ఇట్టే చచ్చి ఊరుకుంటే తను ఏం చెయ్యాలి? తన జాతి యావత్తూ ఎక్కడెక్కడో చేరి అక్కడ వాళ్ళను దోమ కుట్టినప్పుడల్లా, "ఓహో! మహారాజా! మమ్మల్ని కాపాడు. నువ్వే మా రాజువు, మా ప్రాణ రక్షకుడివి!" అని ఏడిచినప్పుడల్లా వెళ్ళి వాళ్ళ వ్యవహారాలు చక్కపెట్టటమేనా తన పని? తమను తాము కాపాడుకోలేని వెధవలు తగుదుమమ్మా అని ఆ దండకారణ్యంలో నివసించటమెందుకు, తన రెక్కల నీడన లంకలోనే ఉండిపోక! లంకలో వాళ్ళకు అరాజకంగా నివసించేటందుకు వీలులేదు – అంతకంటె మరేమీలేదు!... ఏమయింది అయింది. తను ఈ చిన్న నాటకం ఆడక తప్పదు. సీతను ఎవరు తీసుకు వెళ్ళినదీ రామలక్ష్మణులకు తెలియకుండా ఉండగలందుకు మారీచుడు తనకు సహాయం చెయ్యటానికి ఒప్పుకున్నాడు. శూర్పణఖ కూడా పర్ణశాల జీవితాన్ని గురించి చాలా వివరంగా చెప్పింది.

కాని సీతను చూడగానే తన మనస్సు చలిస్తుందని రావణుడు కలలో కూడ అనుకోలేదు. శూర్పణఖ సీతను గురించి చేసిన వర్ణన అతను నమ్మలేదు – తన్ను కార్యోన్ముఖుణ్ణి చెయ్యటానికి అట్లా చెప్పిందనుకున్నాడు. శూర్పణఖ తన్నింకా చిన్ననాటి రావణుడి కిందనే కట్టిందనుకొని నవ్వుకున్నాడు. సీత నిజంగానే అసమాన సౌందర్యవతి. ఆమె శరీరచ్ఛాయ పాలిపోయినట్లుండకుండా దండకారణ్య వాసం చేత లేత గోధుమ రంగుకు తిరిగింది. ఆమె అవయవాలు కూడా దృఢంగా ఉన్నై. ఆమె ముఖం ఎంత కళావంతంగా ఉంది!... వార్ధక్యంలో కూడా తన సౌందర్య పిపాస చావలేదు.

తను పట్టుకోగానే సీత మూర్ఛిల్లేటప్పటికి తన హృదయం ద్రవించింది. ఇంకా తన హృదయానికి ద్రవణశక్తి పోలేదన్న మాట – పోయినట్టు పైకి కనిపించుతున్నప్పటికీ!

ఈ సీత తన అశోకవనంలో ఉంటే ఎంత బాగుంటుంది! నిజంగా అశోకవనానికి సీతే లోటు!

మూర్ఛలో నిద్రపోతున్నట్టున్నది సీత. ఆమెను మొదట చూడగానే పోయినంత పని చేసిన తన బుద్ధి తిరిగి స్థిరత్వం పొందింది... ఇటువంటి సౌందర్యవతి ఇట్లా తన చేత చిక్కితే ఒకప్పుడు తను నిశ్చింతగా ఆమె వంక చూస్తూ ఊరుకుండ గలిగేవాడా? ఇప్పుడు సీతను స్పృశించాలనైనా తనకు వాంఛలేదు. తనలో కలిగిన ఈ మార్పు వార్ధక్యమా – రసికత్వంలో పూర్వం కంటె అభివృద్ధి పొందాడా!

సీత చప్పున లేచికూర్చుంది. ఆమె దృష్టి తనమీద పడగానే ఆమె ముఖసౌందర్యంలో ఎనిమిది వీసాలు మాయమయింది.

"ఎవరు నువు?" అంది సీత. రావణుడు చెప్పాడు. సీత ముఖం చిట్లించింది – ఎంత అనార్యద్వేషం!

"నే నెక్కడ ఉన్నాను?"

"నా విమానంలో."

"ఎందుకు? – రామలక్ష్మణులేరీ?"

"అంతకంటె ముఖ్యమైన సమస్య రామలక్ష్మణులది – సీత ఏదీ అని! నేను నిన్ను లంకకు తీసుకుపోతున్నాను."

సీత అఘాయిత్యం చేసి చూసింది.

"ఓరీ, పాపీ! ఒంటరిగా ఉన్న ఆడదాన్ని ఈ విధంగా చెరబట్టటం శౌర్యమనుకున్నావా–"

"అనుకోలేదు. నిన్ను దొంగతనంగా తెస్తున్నాను, శౌర్యంతో కాదు."

"రామలక్ష్మణులుండగా ఈ పని చేస్తే నీపాట్లు తెలిసేవి!"

"అంత శూరులు నన్ను శిక్షించలేకపోరు."

"మోహాంధకారం నీకళ్ళకు ఎగదట్టి – "

"ఎందుకు నిష్కారణంగా నిన్ను నువు ప్రశంసించుకుంటావు? నీ అందం చూసి నేను మోహించానని నువ్వెట్లా ఊహించావు? ఒకవేళ అది నిజమయినా నువ్వే చెప్పుకోటం ఏమంత బాగాలేదు. నిన్ను చూసిన ప్రతివాడూ నీకోసం చస్తున్నాడని నీకొక నమ్మకం ఉన్నట్టుంది – లేక అది కోరికా!" అన్నాడు రావణుడు చిరునవ్వు నవ్వుతూ.

రావణుడి మాటల ధోరణి సీతకు ఇంతవరకూ అర్థం కాలేదు కాని ఈ దెబ్బ ఆమెకు బాగా తగిలింది. ఈ రావణుణ్ణి అన్నట్టుగానే తను ఒకటి రెండు గడియల క్రితం లక్ష్మణుణ్ణి కూడా అన్నది. తనకు తెలియకుండానే రావణుడు సీతను చాలా మర్మమయిన పోటు పొడిచాడు. సీత పిరికి కాదు. రావణుడు తన్ను పట్టుకోగానే కలిగిన భయాల్ని కూడా జయించింది. కాని ఇప్పుడతన్ని చూస్తే మరొకరకం భయం ప్రారంభమయింది సీతకు. దాన్ని పోగొట్టుకోటానికి సీత నోటికివచ్చినట్లు పేలేసింది.

"ఓరీ, దుర్మార్గుడా, నీ పాపఫలం నిన్ను ఎట్లా కట్టి కుదుపుతుందో చూడు. నీకు ప్రాణాలమీద ఏమైనా ఆశ ఉంటే నన్ను తిరిగి రాముడి కిచ్చి ఆయన్ను క్షమాపణ వేడుకో!"

రావణుడు సీతవంక కొంతసేపు నిశ్చలంగా చూసి, "నాతో సామాన్యంగా ఎంత వాళ్ళయినా అమిత గౌరవంగా మాట్లాడుతారు. నీకు నేనింత అలుసు కావటానికి ఏంచేశానో తెలుసుకోలేకుండా ఉన్నాను!" అన్నాడు.

"ఏం చేశావా? నన్నెందుకు చెరబట్టావు? నేను ఆత్మహత్య అయినా చేసుకుంటాను కాని నీకు దక్కుతానా?" అన్నది సీత.

"నీ భర్త మా తాటకినెందుకు చంపాడు? మీ లక్ష్మణుడు మా శూర్పణఖను ఎందుకు పరాభవించాడు? ఒంటరిగా చిక్కిన నిన్ను నే నేమీ చెయ్యని విషయం కూడా గుర్తించలేదు నువు! కనీసం మీ వాళ్ళకంటె నేను పెద్ద మనిషిని. నిన్ను మరొకరు చెరబట్టి ఉండవచ్చును. నిన్ను చెరిచి కూడా ఉండవచ్చును. అటువంటిది జరగకుండా చూసుకోవాలేగాని, నువు అసహాయురాలవుగా ఉండి, నా దగ్గిరికి ఎవరూ రాకండి అంటే ఏం లాభం? మా బలగం నీ భర్త చేతులలో చచ్చింది. మీ రాముణ్ణి మా వాళ్ళు దండకారణ్యంలో అడుగు పెట్టకుండా చెయ్యాలి గాని, 'మా మీద బాణాలు వెయ్యకు' అంటే ఏం లాభం?

"నువు అమిత చెడ్డదానివి. నాకు బలశాలులను చూసినా భయంలేదు. కాని చెడ్డవాళ్ళను చూస్తే భయం! ఇంత ఎందుకూ? నేనే నువ్వయి నువ్వే నేనయి ఉంటే నా మానం నువు తప్పక హరించి ఉండేదానివి! అందుకనే నీకు నీ మానం హరిస్తానని భయం!"

రావణుడు సీతవంక చూడటం మానేసి పరధ్యానంలో పడి కాస్సేపుండి తనలో తను మాట్లాడుకుంటున్న వాడల్లే మాట్లాడసాగాడు.

"ఒకప్పుడు నేను అమిత చెడ్డవాణ్ణి. ఒకసారి రంభ నాకు ఒంటరిగా దొరికింది. బలాత్కారంగా చెరిచాను. ఆమెను తరవాత చూస్తే నా గుండె పగిలిపోయింది. రంభ నన్ను క్షమించలేదు!... మళ్ళా అటువంటి ఘోరం చెయ్యలేదు – చెయ్యలేను!"

అతని గొంతులో మార్పుకు సీత ఒక్కక్షణం చలించింది. మరుక్షణమే ఆమెకు ఋష్యమూక పర్వతం కనిపించింది.

సీత నగలన్నీ తీసి మూటకట్టటం రావణుడు గమనించి, "ఏం చేస్తున్నావు?" అన్నాడు.

"ఈ నగలన్నీ నా కెందుకు? కింద పడవేస్తే ఎవరికన్నా పనికిరావచ్చు" అన్నది సీత.

"ఈకాసిని నగలతో ఏం పని అవుతుంది?" అన్నాడు రావణుడు నవ్వుతూ.

"అయినంత వరకే!"

"నీ యిష్టం!... అదుగో రుష్యమూకం. దానిమీద కనిపించేది సుగ్రీవుడి కొలువు. సుగ్రీవుడికి, పాపం, రాజ్యం తప్పినా కొలువు తప్పలేదు. ఇతని అన్న వాలి మహా బలశాలి. చాలా భోళామనిషి. సుగ్రీవుడు అన్నను చంపి అతని భార్యనూ రాజ్యాన్నీ హరించాలని చూశాడు. వాలి మెతక మనిషి కాకపోతే సుగ్రీవుడు ఎన్నడో చచ్చిఉండును. నా తమ్ముడు నా మీద అట్లా కుట్ర తలపెడితే వెంటనే హతమార్చేస్తాను. శత్రు శేషం ఉండరాదు. చూస్తూ ఉండు, వాలి మంచితనమే వాలి ప్రాణం మీదికి వస్తుంది....

"చిత్రం వాలి నా విరోధి. సుగ్రీవుడు నా విరోధికి విరోధి అయి కూడా నా మిత్రుడు కాడు. తమ విరోధులకు విరోధులయినవాళ్ళతో సఖ్యం చేసుకోవటం మీ ఆర్య లక్షణమనుకుంటాను!"

సీత ఆ ఎత్తి పొడుపు వినిపించుకోలేదు. తన నగల మూట సుగ్రీవుడి కొలువులోకి విసిరివెయ్యటానికి అవకాశం చూస్తున్నది. ఆ అవకాశం ఇప్పుడు లభించింది.

"నేను పడేసిన ఈ నగలు నీ ప్రాణం మీదికి రానున్నై. నువు తెలివిగల వాడివని నీ కింత గర్వం. ఆ మాత్రం కనుక్కోలేకపోయినావు!" అన్నది సీత.

రావణుడు నవ్వి, "నేను నీతో సుగ్రీవుడి విషయం ఎందుకు చెప్పాననుకున్నావు?" అన్నాడు.

మళ్ళా తనను రావణుడు పరాభవించాడని సీత కనుక్కున్నది.

"చూడు, సీతా! నీమౌగ్ధ్యం చూస్తే నాకు ముచ్చటగా ఉంది. నీకు నిజంగా రాముడు సర్వశక్తిమంతుడని నమ్మకం ఉందా?" అన్నాడు రావణుడు.

"నాభర్తకంటె శూరులులేరు. రాముడు లోకాలన్నీ జయించగలడు!" అన్నది సీత ఎంతో భక్తి విశ్వాసాలు ఉట్టిపడేటట్టు.

"అయితే లక్ష్మణుణ్ణి రాముడి సహాయార్థం ఎందుకు పంపావు?" అన్నాడు రావణుడు నవ్వుతూనే. కాని ఆ ప్రశ్నకు సీత మొహాన కలిగిన ఆవేదనకు రావణుడి చిరునవ్వు మాయమయింది.

"ఆ మాట అడిగినందుకు క్షమించు. నువు అజ్ఞానంలోచేసి పశ్చాత్తాపపడ్డ పనిని తవ్వాను... నీకు రాముడి శక్తియందు నమ్మకం ఉందని నాకు విశ్వాసం కలుగుతున్నది. నాకుమాత్రం అటువంటి విశ్వాసం లేదు. అతను నిజంగా శూరుడయితే నా ధర్మం నన్ను అతన్ని సంహరించటానికి ప్రేరేపిస్తుంది. నీకోసం అతను నా మీదికి యుద్ధానికి వచ్చేవరకూ నీకూ నాకూ వైరంలేదు. అంతవరకూ నువ్వు నా అతిథివి. నీకు నా మీద దురభిప్రాయాలు లేకుండా ఉంటే నేను చాలా సంతోషిస్తాను!"

సీత అతనికి సమాధానం చెప్పలేదు. విమానం లంక ప్రవేశించింది.

❀ ❀ ❀ ❀ ❀

"చూడు, సీతా! ఈ అశోకవనం నువు ఉండటానికి సిద్ధం చేశాను. నా రాజ్యంలో ఇంత అందమైన ప్రదేశంలేదు. నేను దీన్ని ప్రాణప్రదంగా ఉంచుతున్నాను. ఇక్కడ మా స్త్రీలు బోలెడంతమంది నీకు తోడుగా ఉంటారు. మా నాగరికత యావత్తూ నీకు తెలియజేస్తారు. మా విభీషణుడి కుమార్తె స్వయంగా నీకు చెలికత్తెగా ఉండటానికి ఏర్పాటు చేశాను. నీకేమి కావలసివచ్చినా వీళ్ళు నీ కోరిక తీర్చుతారు. ఈ వనంలో మరెవరూ అడుగుపెట్టకుండా ఆజ్ఞయిచ్చాను. నేనెప్పుడన్నా వచ్చి నీ యోగక్షేమాలు విచారిస్తాను" అన్నాడు రావణుడు.

"నీ కపటం నేను గ్రహించలేననుకున్నావా? వీళ్ళందరినీ నేను పారిపోకుండా నాకు కాపలాపెట్టి నాకు చెలికత్తెలుగా పెట్టానంటావా? అన్ని బంగారపు మేడలు పెట్టుకుని నన్నీ పొదల మధ్య పారేసి ఇంత అందమైనచోటు ఎక్కడా లేదంటావా?" అని సీత ధుమ ధుమ లాడింది.

రావణుడు నిర్ఘాంతపోయినాడు సీత అజ్ఞానం చూసి.

"నువు తెలిసి మాట్లాడుతున్నావా, కలవరిస్తున్నావా? ఈ ప్రహరీ గోడలూ ఈ సముద్రమూ దాటి నువు పారిపోతావూ! నువ్వట్లా చెయ్యకుండా వీళ్ళందర్నీ కాపలాపెట్టానా! నీ మాటలకు నవ్వాలో ఆగ్రహించాలో నాకు తెలియకుండా ఉంది... నీకు నిజంగా ప్రకృతి సౌందర్యం అర్థంకాదా? ఇంతకంటె నీకు నా మేడలు బాగున్నవా? నీకు మళ్ళీ రాముణ్ణి చేరుకునే ఆశలేదా ఏమిటి? నా అంతఃపురంలో నువు నివసిస్తే ప్రమాదం నీకా, నాకా? పోనీ నీ యిష్టం! నా అంతఃపురానికే పోదాం, పద!?"

"ఛీ! అవాచ్యాలాడకు! రాముణ్ణి ఎడబాసి, రాముడు నాకోసం అరణ్యాల్లో వెతుకుతుంటే నేను నీ అంతఃపురంలో ఉంటాననుకున్నావా?"

"ఎబ్బే! ఉద్యానవనాల్లో ఉంటావుకాని!" అన్నాడు రావణుడు క్రూరంగా.

❀ ❀ ❀ ❀ ❀

రావణుడు సీతతోపాటు ఒక సమస్యను తెచ్చుకున్నాడు తన నెత్తిమీదికి. సీత తన్ను అర్థంచేసుకోనందుకూ, తనతో అజ్ఞానంగా ప్రసంగించినందుకూ అతనికి కోపం కలిగేది. కాని సీత అవస్థ తలుచుకుంటే అతనికి జాలివేసింది. తన ఆతిథ్యం ఆమెకు రుచించలేదు. ఆమెకిది నిర్బంధంగానే ఉంది. సీత అఘాయిత్యంచేసి తనకు ఉన్న స్వేచ్ఛను కూడా వినియోగించక, నిద్రాహారాలు మాని కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూ ఉండటం అతనికి చాలా కష్టంగా ఉంది. రాముడి అవివేకానికి సీతకు ఎందుకు శిక్ష పడాలి? సీత తన్ను ఎందుకు అర్థం చేసుకోదూ?

ఆ ప్రయత్నం మీద తను సీత దగ్గిరికి వెళ్ళితే ఆమె అమిత అసహ్యంగా ప్రవర్తించుతుంది. ఒకసారి ఈ సీత తన ముఖమైనా చూడక చేతిలో గడ్డిపోచ పట్టుకొని దానితో సంభాషించటం మొదలుపెట్టింది - తనే ఆ గడ్డిపోచ అయినట్టు. సీత ఆత్మవంచన చూస్తే తనకు అరికాలిమంట నెత్తికెక్కుతుంది; ఆమె వయసూ, ఆమె పడుతున్న బాధా చూస్తే తన మనస్సు మళ్ళీ కరిగిపోతుంది.

సీతకు రాముడిమీద అపారమైన విశ్వాసమూ భక్తీ ప్రేమా ఉన్నవని రావణుడు గట్టిగా నమ్మగలిగాడు. అతనికి రాముణ్ణి చూస్తే అసూయ కలిగింది. తనయందు అటువంటి భక్తీ ప్రేమా విశ్వాసాలు ఉంచి ఉండిన స్త్రీ లేదు. సీత మరొకడియందు అటువంటి భావం కలిగిఉండినందుకు రావణుడు సీతను ప్రేమించాడు. సీతలో ఉన్న ఇతర లోపాలన్నీ మరిచిపోగలిగాడు. మనకు భగవంతుడియందు విశ్వాసం లేకపోయినా, ఆ భగవంతుడియందు నిజమైన విశ్వాసం ఉన్నవాడియందు మనకు సానుభూతి కలిగినట్టు!

రావణుడికి సీతమీద అంకురించిన ఈ ప్రేమ దినదినాభివృద్ధి చెందింది. ఇక సీత తనతో ఎట్లా ప్రవర్తించినా అతనికి కోపంలేదు. ఎప్పుడూ తనకు సీత ఆలోచనే అయిపోయింది. అటువంటి భార్య ఉండటం ఎట్లా ఉంటుందో తనకేం తెలుసు? తన అనుభవమంతా ఆ రాముడి అనుభవంలో ఏమూల? అంత అప్రయోజకుడిమీద అంత ప్రేమ విశ్వాసాలు చూపించే సీత అదృష్టవశాత్తూ తన్ను ప్రేమించి ఉండినట్టయితే ఇంకా ఎంత ప్రేమ విశ్వాసాలు కలిగిఉండేది!

రాముడి ప్రయోజకత్వం తనకు ఏరోజు కారోజు వచ్చే వార్తలవల్ల తెలుస్తూనే ఉంది. అతను సుగ్రీవుణ్ణి ఆశ్రయించి వాలిని చంపి సుగ్రీవుడికి వాలి రాజ్యాన్నీ భార్యనూ ఇప్పించాడు. ఇంతకాలం కలవరించిన కోరిక తీరగానే సుగ్రీవుడు సింహాసనం ఎక్కి కూర్చుని రాముడి మాట మరిచిపోయినాడు. ఆఖరుకు రాముడు లక్ష్మణుడిద్వారా కబురుచేస్తే, "చిత్తం, ఈ వానాకాలం వెళ్ళనివ్వండి, సీతకోసం వెతుకుదాం!" అన్నాడు సుగ్రీవుడు!

సీత తన భార్య అయివుంటే? ఈ పాటికి ఎప్పుడో మూడులోకాలూ తల్లకిందులు చేసి సీతను హరించిన వాణ్ణి హతమార్చి ఉండడా? సీత మీది ప్రేమ తన శక్తిని వెయ్యింతలు చేసి ఉండదా?.... తను ఎప్పుడైనా అంత దారుణం చేశాడా? - రాముడు వాలిని చాటుగా చంపినట్టు. వాలీ సుగ్రీవులలో తేడాకూడా తెలియలేదు, ఈ ప్రజ్ఞావంతుడైన రాముడికి!

ఇదంతా సీత ఎట్లా అర్థం చేసుకుంటుంది?....

❀ ❀ ❀ ❀ ❀

ఆరోజు తన కెంత దుర్దినం!... ప్రతిఫలం కోరని తన ప్రేమను బయటపెట్టినందుకు సీత ఎంత అల్లరిచేసిందీ!.... సీత తన్ను అర్థం చేసుకుంటుందని తను ఎట్లా పొరపాటు పడ్డాడూ?... ఆమె తన్ను ఎప్పుడు ఏ విషయంలో అర్థం చేసుకుంది కనకా!

ఈ ఆలోచనలతో రావణుడు చాలా పొద్దుపోయి కన్నుమూశాడు. కన్నుమూయగానే అతనికొక భయంకర స్వప్నం ప్రారంభమయింది. తన్ను భయంకరాకారులు హింసించసాగారు. సీత తన శరీరాన్ని ఈటెపెట్టి పొడుస్తూ తన రక్తంతో ఆడుకుంటున్నది. ఎంత నాజూకైన ఆటా! తన చెవులు ఫెళఫెళరావాలతో కలకలరావాలతో తడికెలు పడుతున్నై. ఈ స్థితిలో అతనికి నిద్రాభంగం అయింది.

"ప్రభూ! ప్రభూ!"

రావణుడు చివాలున లేచి కూర్చున్నాడు. ఆ కలకలం కేవలమూ ఊహాజనితం కాదు. ఎక్కడో పెద్ద కలకలం అవుతున్నది.

"ఏమిటది? ఏమిటాగోల"

"ఏదో పెద్ద జంతువు అశోకవనంలో ప్రవేశించింది. ప్రభూ! చెట్లన్నీ ధ్వంసం చేస్తున్నది. అడ్డం వెళ్ళిన వారిని చంపేస్తున్నది. దాన్ని ఎవరూ ఆపలేకుండా ఉన్నారు."

రావణుడు చప్పున లేచి "సీత!.. ఆమె కేమీ అపాయం కలగలేదు కద!... పాపం చాలా దీనదశలో కూడా ఉంది!" అంటూ అశోకవనం వైపు పరుగెత్తసాగాడు.

సీతకు ఏమైనా ప్రమాదం జరగలేదుకద! తనకెంత అవమానం! నిజంగా సీతకు ఆవగింజంత అపకారం జరిగినా తను మూడులోకాలూ తల్లకిందులుచేసి అయినా సీతకు అపకారం చేసిన వాడిమీద పగతీర్చుకుంటాడు కాని ఊరుకుంటాడా?.. ఎవరీ మృగం?

ఈ ఆదుర్దాలో రావణుడు తన రాచరికం కూడా మరిచి అశోకవనంవైపు పరుగెత్తాడు.

ఆ వనంలోకి ప్రవేశించగానే, ఆ దృశ్యం, ఆ నాశనం తన కళ్ళపడగానే కళ్ళు చిల్లులు పడినట్టయింది రావణుడికి. ఇంకా తెల్లవారలేదు. అస్తమించటానికి సిద్ధంగా ఉన్న చంద్రుడి కాంతిలో ఆ దృశ్యం ఎంత బీభత్సంగానన్నా ఉంది. అంత విస్తీర్ణమైన వనంలోనూ ఒక్కచెట్టు, ఒక్క లత, ఒక్క పొదరిల్లు బీరుపోకుండా అంతా ధ్వంసమయింది. ఒక్క రాత్రిలో ఒక్క మృగం ఇంతపనిచేయగలిగిందా? తను ఇంత ముద్దుగా పెంచుకున్న ఈ అశోకవనం ఎవరి కపకారం చేసింది?...

తాత్కాలికంగా అతను మరిచిపోయిన సీత ఆలోచన మళ్ళా జ్ఞాపకం వచ్చి రావణుడు సీత ఉన్నవేపు పరిగెత్తాడు. అక్కడ ఎవరూ లేరు. అక్కడి అశోకాలు మాత్రం ధ్వంసం కాలేదు. కాని ఆ ప్రదేశంలో ఎవరూ కనిపించలేదు. ఆ చోటు సీతలేని కారణం చేత

పాడుబడ్డ గుడి మాదిరిగా ఉంది. సీతను చెలికత్తెలు ఎక్కడికైనా చేర్చి ఉంటారేమో ననుకున్నాడు రావణుడు.

ఇంతలో సీతే వచ్చింది అక్కడికి. ఆమె సంతోషంతో నృత్యం చేస్తున్నది. ఆమె ముఖం ఆనందంతో కళకళలాడుతూ చంద్రుడు అస్తమించిన కొరత తీర్చటానికి సిద్ధంగా ఉన్నట్టున్నది... రావణుడు సత్యం కనుక్కున్నాడు.

"ఎట్లాగయితేనేం నీ ముఖాన మందహాసం చూడగలిగాను. సీతా! తీరా నువు నవ్వేటప్పటికి నేను ఆనందించలేని స్థితిలో ఉన్నాను. నా గుండె కొయ్యబారిపోయింది!" అన్నాడతను స్వరరహితమైన గొంతుతో.

"దుర్మార్గుడా, నీ పాపం పండింది. చూడు, చుట్టుచూడు! ఇది ప్రస్తావన. ఇవాళ ఈ చెట్లకుపట్టిన గతి రేపు నీకూ నీ వారికీ పట్టబోతున్నది.నా రాముడి దూత నన్ను చూడటానికి వచ్చాడు" అన్నది సీత.

"నేను నీ రాముణ్ణయితే స్వయంగా వచ్చి ఉండేవాణ్ణి సుమా!"

"నిన్ను కూడా చూసే పోతాడులే!" అన్నది సీత రావణుడిమాట సరిగా అర్థం చేసుకోలేకుండా.

"నన్ను చూడటానికి చక్కని ఈ వనం ధ్వంసం చెయ్యటం దేనికీ? మీవాళ్ళకు సౌందర్య పిపాసయినా లేదా?"

"అయిపోయిన దానికెందుకు చింతిస్తావు – కాగల దానిలో సహస్రాంశం లేదు!" అన్నది సీత పరిహాసంగా.

"నేను నిన్నేమయినా చెయ్యదలుచుకుంటే అంతే! కానీ నేనేమీ చెయ్యదలుచుకోలేదు, కనక అయిపోయిన దానిలో కాగలది సహస్రాంశమైనా లేదు!" అంటూ రావణుడు తలవంచుకొని వెళ్ళిపోయినాడు.

సీత ఆ వృక్షశవాలమధ్యే వుండి వెళ్ళిపోతున్న రావణుడివంక అర్థం కాకుండా చూస్తూ నిలబడ్డది. ఆమె మెదడులో కొంచెం కదలిక కలిగింది!...

***మొదటి ముద్రణ: ఏప్రిల్ 1952 ?***
***కాలభైరవుడు కథల సంపుటి***
***యువ బుక్ డిపో, మద్రాసు***